epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 245 ఎడిటర్ : విక్రం కుమార్ బుధవారం 14, మే 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

# ఉగ్రవాదం కొనసాగితే పాక్ అంతుచూస్తాం

- ఆపరేషన్ సిందూర్‌తో లక్ష్మణరేఖ గీశాం
- ఇక ఉగ్రదాడులకు జవాబు పక్కాగా ఉంటుంది
- మన సైనిక స్థావరాలను ఏమీ చేయలేకపోయారు
- భారత్ శాంతికాముక దేశం
- ప్రజలపై దాడిచేస్తే ఎలా స్పందించాలో తెలుసు
- ధర్మస్థాపనకు ఆయుధం పట్టడం మన సంప్రదాయం
- ఆదంపూర్ ఎయిర్‌బేస్ నుంచి మోదీ స్పష్టీకరణ
- అక్కడికి ఆకస్మికంగా వచ్చిన ప్రధాని

**మే 13, సమయం న్యూస్, ఢిల్లీ:** పాకిస్థాన్ గడ్డపై నుంచి ఉగ్రవాదం ఇకమీదటా కొనసాగినట్లయితే ఆ దేశాన్ని సర్వనాశనం చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు స్పష్టమైన లక్ష్మణరేఖ గీశామని చెప్పారు. ఎవరైనా ఉగ్రదాడి చేస్తే భారత్ జవాబిస్తుందని, అది పక్కాగా ఉంటుందని స్పష్టంచేశారు. ఇటీవలి దాడుల్లో భారత్‌కు చెందిన ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థను, పంజాబ్‌లోని ఆదంపుర్ వైమానిక స్థావరాన్ని ధ్వంసం చేసినట్లు పాక్ తప్పుడు ప్రచారం చేసిన నేపథ్యంలో సరిహద్దుకు 100 కి.మీ. దూరంలో ఉన్న ఈ స్థావరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అదే రక్షణ వ్యవస్థ ముందు నిల్చొని దాయాది దేశానికి బలమైన సందేశం పంపించారు. మన

తరువాయి 2లో



## అందాల భామలకు పసందైన విందు

- చౌమొహల్లా ప్యాలెస్‌లో మిస్‌వరల్డ్ పోటీదారులకు ప్రభుత్వ ఆతిథ్యం
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రముఖులు
- ప్యాలెస్ సందర్శన మరిచిపోలేని అనుభూతి అన్న ముద్దుగుమ్మలు
- నేడు వరంగల్ కోట, వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయ సందర్శన




## క్షిపణి వేగంతో బీడీఎల్, మిధానీ షేర్లు




- ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగ రక్షణ కంపెనీల షేర్లు కూడా
- పరికరాల ఉత్పత్తి పెంచాలన్న ప్రధాని పిలుపు ఫలితం

**మే 13, సమయం న్యూస్ :** పహల్గాంలో ఉగ్రవాదుల నరమేధానికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం విజయవంతంగా దాడులు నిర్వహించి, వాటిని నేలమట్టం చేయడమే కాదు.. ముష్కరులనూ అంతమొందించింది. ఈ దాడుల్లో దేశీయంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలు, ఆయుధ సామగ్రిని

తరువాయి 2లో

## మూడు నెలల్లోగా ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థ

- ఆదాయం పెంపునకు 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు
- అంతర్జాతీయంగా ఎర్రచందనం విక్రయాలపై కమిటీ
- ఆదాయార్జన శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

**మే 13, సమయం న్యూస్, అమరావతి:** భవిష్యత్తులో ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు గత 30 ఏళ్ల ఫలితాల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు

తరువాయి 2లో





## రూ.19 వేల కోట్లతో మెట్రో రెండోదశ మలిభాగం

- ప్రభుత్వానికి చేరిన డీపీఆర్‌లు
- జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట, శంషాబాద్ విమానాశ్రయం - ఫ్యూచర్‌సిటీ మార్గాల్లో నిర్మాణం

**మే 13, సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశ మలిభాగం(2 బి) దాదాపు రూ.19వేల కోట్ల అంచనాలతో రూపుదిద్దుకుంది. మూడు మార్గాల్లో 86.5 కి.మీ. ప్రతిపాదించారు. జేబీఎస్ మేడ్చల్; జేబీఎస్ శామీర్‌పేట;శంషాబాద్ విమానాశ్రయంఫ్యూచర్‌సిటీ మార్గాలను ఇందులో చేర్చారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) బోర్డు ఇటీవల ఆమోదం తెలపడంతో నివేదిక తాజాగా ప్రభుత్వానికి చేరింది. వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు.

**హకీంపేట రన్‌వే కింద నుంచి ఎలైన్‌మెంట్**

మూడు మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌లను సిద్ధం చేశారు. ఎక్కడా డబుల్ డెక్‌ని ప్రతిపాదించ లేదు. గతంలో జేబీఎస్‌శామీర్‌పేట, జేబీఎస్‌మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ స్తంభాలను వేయాలని కసరత్తు జరిగింది. ఒక అంతస్తులో రహదారి, రెండో అంతస్తులో

తరువాయి 2లో

## 'ఎన్‌డీబీ' పనులకు మోక్షం!




- వైకాపా హయాంలో పడకేసిన ప్రాజెక్టు
- 1,244 కి.మీ.కు విస్తరించింది 71 కిలోమీటర్లే
- గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వ ప్రణాళిక

## చార్మింగ్.. షాపింగ్.. హెరిటేజ్ వాకింగ్

- చార్మినార్ చెంత సుందరీమణుల సందడి
- లాడ్‌బజార్‌లో షాపింగ్.. చౌమొహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్

**మే 13, సమయం న్యూస్, హైదరాబాద్:** చారిత్రక చార్మినార్ పరిసరాలు అందాలభామలతో కోలాహలంగా మారాయి. నాలుగు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన నిర్మాణం వద్ద 109

తరువాయి 2లో



# అందాల భామలకు పసందైన విందు

హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లోని చారిత్రక చౌమొహల్లా ప్యాలెస్‌లో మిస్‌వరల్డ్ పోటీదారులు సందడి చేశారు. నిజాం వంశస్థుల రాజసింహాసనాన్ని, సైనిక సామగ్రిని ఆసక్తిగా తిలకించారు. ఈ చారిత్రక కట్టడం, ఇతర నిర్మాణాలపై తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన వీడియోను వీక్షించారు. హైదరాబాద్ వంటకాలను రుచిచూశారు. విద్యుత్ దీపాలతో ధగధగ మెరిసిపోతున్న ప్యాలెస్‌ను చూస్తూ మైమరిచిపోయారు. 72వ మిస్‌వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వం పోటీదారులకు మంగళవారం రాత్రి చౌమొహల్లా ప్యాలెస్‌లో ప్రత్యేక విందు ఏర్పాటు చేసింది. కంటెస్టెంట్లతోపాటు ఒక్కో రంగం నుంచి 1015 మంది చొప్పున సుమారు మూడొందల మందిని ఆహ్వానించింది. ప్రస్తుత మిస్‌వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా, మిస్‌వరల్డ్ సీఈఓ జూలియా మోర్లేతోపాటు పోటీల్లో పాల్గొంటున్న ముద్దుగుమ్మలు హాజరయ్యారు. సాయంత్రం వేళ హిందుస్థానీ షహనాయి సంగీత వాయిద్యాలతో వీరికి స్వాగతం లభించింది. పాతబస్తీ సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే నృత్యరీతులతో మహిళలు ఆహ్వానం పలికారు.

*** విదేశీ రాయబారులు, వివిధ రంగాల ప్రముఖులు..**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందుకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులతోపాటు దక్షిణాఫ్రికా, గయానా, సీషెల్స్, పెరూ, వెనెజువెలా, పనామా, నేపాల్, ఇండోనేసియా, గినియా, కామెరూన్ దేశాలకు చెందిన రాయబారులు హాజరయ్యారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సికింద్రాబాద్ మిలిటరీ కళాశాల కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వార్షినె, 'ఈనాడు' గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, సినీనటుడు అక్కినేని నాగార్జున, నిర్మాతలు అల్లు అరవింద్, దగ్గుబాటి సురేశ్, హీరోయిన్ శ్రీలీల, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సతీమణి గీతతో కలిసి రాగా, మిస్‌వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా ఆయనకు అభివాదం చేశారు.

*** నగరం, ప్యాలెస్ విశిష్టతపై వీడియో ప్రజంటేషన్..**

మిస్‌వరల్డ్ పోటీదారులకు చౌమొహల్లా ప్యాలెస్, హైదరాబాద్‌లోని చారిత్రక నిర్మాణాలు, కట్టడాల విశిష్టతపై అధికారులు వీడియో ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అందాలభామలు తిలకించారు. నిజాం వంశస్థుల రాజసింహాసనం, వారు వాడిన వస్తువులు, సైనిక సామగ్రి, వంట సామగ్రిని ఆసక్తిగా గమనించారు. పసందైన హైదరాబాదీ వంటకాలతో ఇచ్చిన విందును కంటెస్టెంట్లు, ఆహూతులు ఆస్వాదించారు. వంటకాలన్నీ చాలా బాగున్నాయన్నారు. మంచి ఏర్పాట్లు చేశారంటూ రాష్ట్ర ప్రభుత్వానికి పోటీదారులు కృతజ్ఞతలు తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌తో హైదరాబాద్ ప్రపంచ చిత్రపటంలో నిలిచిపోతుందని హీరో అక్కినేని నాగార్జున అన్నారు.

# రూ.19 వేల కోట్లతో మెట్రో రెండోదశ మలిభాగం

(మొదటిపేజీ తరువాయి)

మెట్రో నిర్మించాలని భావించినా స్టేషన్లు చాలా ఎత్తులో నిర్మించాల్సి రావడంతో హెచ్ఏఎంఎల్ విముఖత చూపింది. జేబీఎస్ నుంచి కార్ఖానా, అల్వాల్, హకీంపేట, తూంకుంట, శామీర్‌పేట వరకు 22 కి.మీ. మెట్రో ప్రతిపాదించారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ రన్‌వే.. రహదారి పక్కనే ఉండటం, ఎలివేటెడ్‌కు రక్షణ సంస్థ అభ్యంతరం తెలపడంతో ఇక్కడ సుమారు కిలోమీటరున్నర వరకు భూగర్భంలోంచి మెట్రోని ప్రతిపాదించారు. రన్‌వే కింద నుంచి మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు. జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్‌కు 24.5 కి.మీ. మేర మెట్రోని ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆంక్షలతో ఈ మార్గంతోపాటు శామీర్‌పేట ట్రాక్‌లు కూడా జేబీఎస్ నుంచి ప్రస్తుతమున్న కారిడార్ కన్నా తక్కువ ఎత్తులో వెళతాయి. మూడు మార్గాల కూడలిగా జేబీఎస్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలన్న సీఎం ప్రణాళికకు అనుగుణంగా ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు 40 కి.మీ. మార్గం ప్రతిపాదించారు. విమానాశ్రయంలో టర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో రావిర్యాల ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్‌లో మెట్రో వెళితే.. అక్కడి నుంచి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలోంచి భూ మార్గంలో 18 కి.మీ. వెళ్లేలా డీపీఆర్ సిద్ధం చేశారు.

**కేంద్ర, రాష్ట్ర సంయుక్త ప్రాజెక్టుగా..**

రెండోదశ రెండో భాగాన్ని సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టుగా చేపట్టేలా డీపీఆర్ రూపకల్పన చేశారు. అంచనా వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. 48 శాతం బ్యాంకుల నుంచి రుణాలు, మిగిలిన 4 శాతం పీపీపీలో సమకూర్చుకునేలా డీపీఆర్ రూపొందించారు.

# మూడు నెలల్లోగా ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయార్జన శాఖలను ఆదేశించారు. ఇందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ సేవలను విస్తృతంగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి శాఖకు ఏఐ బృందం తప్పకుండా ఉండాలన్నారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలందించేలా 3 నెలల్లోగా ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 'బంగారం అత్యధికంగా కొంటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ.. పన్ను ఆదాయం ఆ స్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలి. కర్ణాటక, తమిళనాడుల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే, రాష్ట్రంలో ఎందుకు తక్కువగా వస్తుందో పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలి. నెలవారీ లక్ష్యాలు అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలి. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తెచ్చి రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకాల వరకు రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలి. రాబడి పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. కేంద్ర సాయం, అప్పులు ప్రాథమిక దశలో నిలబడేందుకే ఉపయోగపడతాయి. ఒకటి, రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదు. రూ.వేల కోట్ల విలువైన ఎర్రచందనం రాష్ట్రానికి మాత్రమే సొంతం. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి, వాటి విలువ ఎంతన్నది లెక్కించి, అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలి' అని సీఎం ఆదేశించారు.

**రూ.1.34 లక్షల కోట్ల రాబడి లక్ష్యం**

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025 26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. ఇది గత ఏడాది కంటే 29% ఎక్కువన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ శాఖల ఆదాయంలో తగ్గుదల ఉందని, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రాబడి పెరిగిందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.12,717 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చిందని వివరించారు. 202425లో ఇదే కాలానికి కేంద్రం నుంచి వచ్చిన రూ.17,170 కోట్ల కంటే ఇది 29 శాతం తక్కువని వెల్లడించారు. కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం: 'రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. గత నెలలో రూ.2,116 కోట్ల రాబడి వచ్చింది. 202425లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84% ఎక్కువ. ఈ ఏడాది రూ.33,882 కోట్ల రాబడి అంచనా వేస్తున్నాం. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది' అని ఆ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.

# ఉగ్రవాదం కొనసాగితే పాక్ అంతుచూస్తాం

(మొదటిపేజీ తరువాయి)



దేశానికి చెందిన సైనిక స్థావరాల్లో ఏ ఒక్కదానికి కూడా పాక్ నష్టం కలిగించలేక పోయిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలను ఉద్దేశించి తొలిసారిగా ప్రసంగించిన ఆయన.. వాటి సేవల్ని కొనియాడారు. మన దళాలు సాధించింది అద్భుతమైన, ఊహకు అందని గొప్ప విజయమని శ్లాఘించారు. త్రివిధ దళాలకు దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుందని చెప్పారు.

**ఆకస్మికంగా వచ్చి.. భుజం తట్టి..**

ముందస్తు ప్రకటన చేయకుండా వైమానిక స్థావరంలో దిగిన మోదీ అక్కడ కలియతిరిగారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి వారి భుజం తట్టారు. తాము చేపట్టిన ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. అంతా కలిసి 'భారత్ మాతాకీ జై' అని నినాదాలిచ్చారు. త్రిశూలంతో కూడిన పశ్చిమ వాయుస్థావర టోపీని ఆయన ఈ సందర్భంగా ధరించారు. ''అప్రమత్తంగా ఉండండి. ఇది సరికొత్త భారతదేశం. ఈ దేశం శాంతిని కోరుకుంటోంది. కానీ మన ప్రజలపై దాడిచేస్తే పోరాట క్షేత్రంలో శత్రువును ఎలా మట్టి కరిపించాలో కూడా భారత్‌కు తెలుసు. ఆపరేషన్ సిందూర్ సాధారణమైనది కాదు. మన విధానం, ఉద్దేశం, నిర్ణయాత్మక సామర్థ్యాల కలయిక అది. తమకు పాక్ సైన్యం రక్షణ కల్పిస్తుందని ఉగ్రవాదులు అనుకున్నారు. మన త్రివిధ దళాలు మాత్రం ఉగ్రవాదులకు సురక్షిత ప్రదేశమనేది లేదని చాటిచెప్పాయి. ముష్కరుల్ని వారి రహస్య స్థావరాల్లోనే అంతమొందిస్తాం. తప్పించుకునే అవకాశమే ఇవ్వం. అమాయకుల్ని చంపితే విధ్వంసం సృష్టించి నాశనం చేస్తాం'' అని ప్రకటించారు.

**ఉదయాన్నే మీ దర్శనానికి వచ్చాను**

సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) వంటి కేంద్ర సాయుధ పోలీసు బలగాల సేవల్ని కూడా మోదీ ప్రశంసించారు. ''మీ దర్శనం కోసం ఉదయాన్నే వచ్చాను. యోధులైన మీరంతా ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేశారు. భారతదేశ పరాక్రమం గురించి కొన్ని దశాబ్దాల తర్వాత కూడా ఏ చర్చ జరిగినా మీరు, మీ సహచరులు ఓ ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోతారు. ప్రస్తుత, భవిష్య తరాలకు మీరు స్ఫూర్తి'' అంటూ వారికి సెల్యూట్ చేశారు.

**వారికి ఇక నిద్రలేని రాత్రులే**

''భారతీయ డ్రోన్లు, క్షిపణుల వేగం, కచ్చితత్వాలను చూసి నిర్ఘాంతపోయిన పాక్‌కు ఇక నిద్రలేని రాత్రులే. ఘర్షణ సమయంలోనూ పౌర విమానాలను వారు నడిపినా వాటికి ఏమాత్రం హాని కలిగించకుండా శత్రువుల్ని మన సేనలు అంతమొందించాయి. ఉగ్రస్థావరాలు, వైమానిక స్థావరాలను నాశనం చేయడమే కాకుండా వారి దురుద్దేశాలు, దుస్సాహసాలనూ ఓడించాం. ఆదంపుర్ సహా మన ఎయిర్‌బేస్‌లపై దాడికి పాక్ ఎన్నో ప్రయత్నాలు చేసింది. మన గగనతల రక్షణవ్యవస్థ బలంగా ఉండటంతో అవన్నీ విఫలమయ్యాయి. పాక్ చేసే అణ్వాయుధ బెదిరింపులకు మనం భయపడేది లేదు. ఎలాంటి కవ్వింపులకు పాల్పడినా దానికి తగ్గ స్థాయిలోనే జవాబు ఉంటుంది. దేశీయంగా తయారైన ఆకాశ్ క్షిపణులతోపాటు అధునాతన ఎస్400లు మనకు బలమైన రక్షణ కవచాలు. శత్రువును అవి తుత్తునియలు చేస్తాయి. మన అధునాతన సాంకేతికత ముందు పాక్ బలాదూర్. గత దశాబ్దకాలంలో ప్రపంచంలోనే ఉత్తమ సాంకేతికతలను మన సైనిక బలగాలకు సమకూర్చాం. భారత్ మాతా కీ జై అనే నినాదానికి ఉన్న ప్రాధాన్యం మన శత్రువులకు అర్థమైంది. ఇదొక నినాదం మాత్రమే కాదు దేశం కోసం ప్రాణత్యాగాలకు సిద్ధమన్న మన సైనికుల ప్రతిజ్ఞ! మన డ్రోన్లు, క్షిపణులు వెళ్లి శత్రువులకు తగలగానే వారికి కూడా ఈ నినాదం వినిపించింది'' అని చెప్పారు.

**ఇదో ప్రత్యేక అనుభవం**

''ఈ ఉదయం ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారు'' అని 'ఎక్స్' వేదికగా మోదీ తెలిపారు. వారితో కలిసి తీసుకున్న చిత్రాలను పంచుకున్నారు. చెక్కు చెదరకుండా ఉన్న ఎస్400 రక్షణ వ్యవస్థ దీనిలో కనిపించింది.

## 'ఎన్‌డీబీ' పనులకు మోక్షం!

అమరావతి: న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) రుణంతో చేపట్టిన రోడ్ల విస్తరణ ప్రాజెక్టును గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండల కేంద్రాల మధ్య, వాటి నుంచి జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేసే ఏకవరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరించే ఈ ప్రాజెక్టును కుదించడంతోపాటు వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఎన్‌డీబీ నుంచి రెండో విడత అడ్వాన్స్ తీసుకొని, వేగంగా పనులు చేసే గుత్తేదార్లకు చెల్లింపులు చేయడంపైనా దృష్టిపెట్టింది. ఈ ప్రాజెక్టులో వైకాపా ప్రభుత్వ తీరుతో 2021 నుంచి మొన్నటి వరకు తొలి విడతలో 1,244 కి.మీ. విస్తరించాల్సి ఉండగా.. కేవలం 71 కి.మీ. మేర మాత్రమే పనులు చేయగలిగారు.

**రెండేళ్లలో పూర్తికావాలి**

- ఈ ప్రాజెక్టు రూ.6,400 కోట్లతో మంజూరైంది. తొలి విడత రూ.3,014 కోట్లతో 1,244 కి.మీ. మేర విస్తరణ పనులు చేపట్టారు.
- గుత్తేదార్లతో ఒప్పందాలు చేసుకుని 2021 మార్చిలో పనులను అప్పగించారు.
- గతేడాది జగన్ సర్కారు దిగిపోయే నాటికి ఉమ్మడి 13 జిల్లాల్లో కలిపి కేవలం 71 కి.మీ. మాత్రమే విస్తరించగలిగారు.
- ఎన్‌డీబీ రుణ అడ్వాన్స్‌గా రూ.230 కోట్లు విడుదల చేయగా, ఆ సొమ్మును కూడా వైకాపా ప్రభుత్వం ఆలస్యంగా చెల్లించింది. రాష్ట్రవాటా 30 శాతం నిధులు వెచ్చించలేదు.
- 2023 మార్చి నాటికి పూర్తికావాల్సిన ప్రాజెక్టు పురోగతి లేకుండాపోయింది.

**కూటమి ప్రభుత్వంలో చెల్లింపులు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. గుత్తేదార్లకు రాష్ట్రవాటా నిధుల నుంచి రూ.200 కోట్లు చెల్లించింది. వాస్తవానికి ఎన్‌డీబీ ఇచ్చిన రుణ అడ్వాన్స్‌ను బట్టి చూస్తే.. రూ.100 కోట్లు చెల్లిస్తే చాలు. కానీ, బకాయిలు ఎక్కువ ఉండటంతో మరో రూ.100 కోట్లు అదనంగా చెల్లించింది. కొంతకాలం కిందట సీఎం వద్ద నిర్వహించిన సమావేశంలో ఈ ప్రాజెక్టును కుదించి, త్వరగా పూర్తిచేయాలని నిర్ణయించారు. మొదటి విడతకే పరిమితం చేసి, 1,244 కి.మీ.లకు బదులు, 910 కి.మీ.లే విస్తరించనున్నారు. పనులు మొదలవ్వని రోడ్లను ప్రాజెక్టు నుంచి తప్పించారు. తొలి దశ అంచనా వ్యయం రూ.3,014 కోట్లు కాగా, దాన్ని రూ.1,761 కోట్లకు తగ్గించారు. గతంలో 71 కి.మీ. పనులు చేయగా, మిగిలిన 839 కి.మీ.లు పూర్తిచేసేందుకు కార్యాచరణ ఆరంభించారు.

**రెండో విడత అడ్వాన్స్‌కు ప్రతిపాదనలు**

ఎన్‌డీబీ నుంచి రెండోవిడత రుణ అడ్వాన్స్ కోసం ఆర్అండ్‌బీ ఇంజినీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రూ.500 కోట్ల వరకు అడ్వాన్స్‌గా ఇస్తే, పనులు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ నుంచి ఈ ప్రతిపాదనలు.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల శాఖకు వెళ్లి, దాన్నుంచి ఎన్‌డీబీకి చేరతాయి. ఎన్‌డీబీ కొన్ని ఆడిట్ వివరాలు కోరింది. అవన్నీ అందజేస్తే రెండో విడత అడ్వాన్స్ అందనుంది. ఆ నిధులొస్తే.. రహదారుల విస్తరణ పనులు వేగవంతం కానున్నాయి.

## చార్మింగ్.. షాపింగ్.. హెరిటేజ్ వాకింగ్



(మొదటిపేజీ తరువాయి)

దేశాల అందగత్తెలు సందడి చేశారు. మిస్ వరల్డ్ 2025 పోటీదారులు హైదరాబాద్‌లోని అద్భుత నిర్మాణమైన చార్మినార్‌ను మంగళవారం సాయంత్రం సందర్శించారు. అనంతరం లాడ్‌బజార్ మీదుగా చౌమొహల్లా ప్యాలెస్ వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్నారు. తొలుత సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సుందరీమణులు చార్మినార్ వద్దకు చేరుకోగా అరబ్బీ మార్ఫా వాయిద్యాల సందడితో రెడ్‌కార్పెట్ స్వాగతం పలికారు. అక్కడ అందగత్తెలతో ప్రత్యేక ఫొటోషూట్ నిర్వహించారు. అనంతరం వారు చార్మినార్‌లోకి వెళ్లి అరగంటకు పైగా ఉన్నారు. దాని అందాలను వీక్షించడంతోపాటు నిర్మాణ నేపథ్యం తదితర అంశాలను తెలుసుకుని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కట్టడం విశిష్టత, చారిత్రక నేపథ్యాన్ని ఇన్‌టాక్ నిర్వాహకులు, పర్యాటక శాఖ గైడ్‌లు వివరించారు. కళా నైపుణ్యానికి మంత్రముగ్ధులై.. చార్మినార్ నుంచి చుడీబజార్ (లాడ్ బజార్) మీదుగా చౌమొహల్లా ప్యాలెస్ వరకు 40 నిమిషాలు హెరిటేజ్ వాక్‌లో సందడి చేశారు. చుడీబజార్‌లో గాజులు, ముత్యాలహారాలు, ఇతర అలంకరణ వస్తువులను ఆసక్తిగా గమనించారు. గాజులు ఇతర కళా నైపుణ్యాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. కొందరు గాజుల తయారీ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. వ్యాపారులు అతిథులకు గులాబీ పూలు ఇచ్చి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఎంపిక చేసుకున్న గాజులు ఇతర అలంకరణ వస్తువులకు డబ్బులు తీసుకునేందుకు నిరాకరించారు. చార్మినార్, లాడ్‌బజార్ ప్రత్యేకతలను వారి వారి దేశాల్లో చాటాలని పోటీదారులను వ్యాపారులు కోరారు. ముద్దుగుమ్మలు వచ్చే సమయంలో దుకాణదారులు మినహా జన సంచారం లేకుండా పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. ఫొటోషూట్.. ప్రత్యేక డ్రెస్‌కోడ్ అందాలభామలను అమెరికాకరేబియన్ దేశాలు, ఆఫ్రికా, ఐరోపా, ఆసియాఓషియానా దేశాలుగా విభజించి ఫొటోషూట్‌లో పాల్గొనేలా చేశారు. ఈ పర్యటన సందర్భంగా సుందరాంగులకు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను సూచించారు. లాంగ్ ఈవెనింగ్ ఫ్రాక్‌తోపాటు భుజాలు, మోచేతి వరకు కవర్ అయ్యేలా దుస్తులు, ఫ్లాట్ షూలు ధరించి పాల్గొన్నారు.

## క్షిపణి వేగంతో బీడీఎల్, మిధానీ షేర్లు

(మొదటిపేజీ తరువాయి)

అధికంగా వినియోగించారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులతో పాటు రష్యా నుంచి తెచ్చుకున్న ఎస్ 400 రక్షణ వ్యవస్థతో పాటు సొంతంగా అభివృద్ధి చేసిన ఆకాశ క్షిపణి రక్షణ వ్యవస్థలూ సమర్థంగా వ్యవహరించడంతో.. పొరుగుదేశం కాళ్లబేరానికి రాక తప్పలేదు. దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తిని మరింత పెంపొందిస్తామని ప్రధానమంత్రి పేర్కొన్న అనంతరం, స్టాక్‌మార్కెట్లో రక్షణ రంగ కంపెనీల షేర్లకు మదుపర్ల నుంచి భారీ మద్దతు లభించింది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) షేర్ల ధరలకు రెక్కలు వచ్చాయి. మంగళవారం స్టాక్‌మార్కెట్లో బీడీఎల్ షేరు 11%, మిధానీ షేరు 4% పెరిగాయి. బీడీఎల్ షేరు 4 రోజుల్లోనే దాదాపు రూ.300 పెరిగి, రూ.1,750 స్థాయికి వచ్చింది. బీఎస్ఈలో మంగళవారం గరిష్ఠంగా రూ.1768 ధర పలికినా, చివరికి రూ.175 (11.16%) లాభంతో రూ.1745 ముగింపు ధర నమోదు చేసింది. మిధానీ షేరు కూడా రూ.11.35 (3.44%) లాభంతో రూ.341.30 ముగింపు ధర పలికింది.



# రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

* **జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
* **రైతుల ముంగిట్లో శాస్త్ర వేత్తలు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్..**

అదిలాబాద్ మే 13(సమయం న్యూస్) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని సిరిసన్న గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్రీమతి శ్యామలాదేవి పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్ చౌహాన్, కె.వికె శాస్త్రవేత్తలు డాక్టర్ కే రాజశేఖర్ డాక్టర్ డి మోహన్ దాస్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులనుద్దేశించి వ్యవసాయంలో ఎరువులను మోతాదుకు మించి వాడకూడదని, రసాయన పురుగు మందులను తెగుళ్ల మందులను విచక్షణ రహితంగా వాడకూడదని, నేటిని ఆదా చేసుకోవాలని, పంట వైవిధ్యాన్ని పాటించాలని, నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని విత్తన రసీదులను భద్రపరచుకోవాలని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి తేజ, మండల ఉద్యానవన అధికారి , అలేఖ్య, మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, మండల స్తాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 2019..2022 ఏడాదిల బడ్జెట్ ఎస్టిమేట్స్ పై అసెంబ్లీ ఎస్టిమేట్స్ కమిటీ సమీక్ష

అమరావతి,13 మే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ అధ్యక్షులు మండపేట ఎంఎల్ఏ వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన ఎస్టిమేట్స్ కమిటీ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్లో సమావేశమై 2019 నుండి 2022 వరకూ మూడేళ్ళ కాలంలో సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలతోపాటు పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించింది. తొలిరోజైన మంగళ వారం ఉ.11గం.లకు సాంఘిక సంక్షేమ శాఖ,మధ్యాహ్నం 2గం.లకు గిరిజన సంక్షేమశాఖ, 3.30.గం.లకు మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖలకు 2019..20, 2020..21,2021..22 ఆర్ధిక సంవత్సరాల్లో ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై సమీక్ష నిర్వహించడం జరిగింది. అలాగే 14వ తేది బుధవారం ఉ.11గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 201922 మూడేళ్ళ కాలంలో బడ్జెట్ అంచనాలపై అసెంబ్లీ అంచనాల కమిటీ అధ్యక్షులు వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన గల కమిటీ సమీక్ష నిర్వహించనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు అఖిలప్రియ, డా.పార్ధసారధి, మద్దిపాటి వెంకటరాజు,నిమ్మక జయకృష్ణ, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్ కుమార్, సాంఘిక, గిరిజన,మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అంబర్ పెట్ డివిజన్ లో పర్యటించిన కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్

అంబర్ పేట,మే, 13(సమయం న్యూస్) : అంబర్ పేట నియోజకవర్గం ప్రేమ్ నగర్ లో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ పర్యటించారు. సంబంధిత సిబ్బందిచే నాలా పూడిక తీత పనులను చేయించడం జరిగింది. మరియు ప్రేమ్ నగర్ లో నల్ల నీరు లో ప్రెషర్ వస్తుండడంతో సమస్యను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే లో ప్రెషర్ సమస్యని పరిష్కరించవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ దుర్గ,బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, వినయ్ హేమలత,భార్గవి స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు

* **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
* **కేంద్రాల వద్ద అధికారులు అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ జరపాలని ఆదేశం**
* **ఉప్లూర్, తిమ్మాపూర్, ధోబీఘాట్ ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**



నిజామాబాద్, మే 13( సమయం న్యూస్): కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గాను సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆర్మూర్ మండల కేంద్రంలోని ధోబీఘాట్, కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్, మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ లలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా అని ఆరా తీశారు. ధోబీఘాట్ వద్ద గల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, కేంద్రం నిర్వాహకుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సమకూరుస్తున్నప్పటికీ ధాన్యం సేకరణలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీశారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యానికి తావిచ్చే సొసైటీలకు వచ్చే సీజన్ లో కేంద్రాలను కేటాయించకూడదని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటదివెంట నిర్దేశిత మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మిల్లుల వద్ద మిల్లర్లు సకాలంలో ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. సూపర్ అమాన్ రకం ధాన్యం దిగుమతి చేసుకునేందుకు పలువురు మిల్లర్లు విముఖత ప్రదర్శిస్తున్నారని కేంద్రాల నిర్వాహకులు తెలుపగా, మిల్లర్లతో సమావేశమై ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహిస్తూ దాదాపుగా తుది దశకు చేర్చారని, ఇదే స్పూర్తితో పని చేస్తూ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని హితవు పలికారు. ఆలస్యంగా పంట దిగుబడులు చేతికి అందిన అన్ని ప్రాంతాలలో కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, పంట విక్రయం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా కల్పించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, డీపీఎం సాయిలు తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

* **జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**



సంగారెడ్డి మే 13(సమయం న్యూస్) :సంగారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో ఉపాధ్యాయుల వృత్తాంతర శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ క్రాంతి వల్లూరు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బోధన విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ విద్యార్థులు నమోదు పెంచే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇంగ్లీష్ శిక్షణ కార్యక్రమంలో రెగ్యులర్గా అన్ని క్లాసులు తీసుకొని ఇంగ్లీష్ అందరు పిల్లలకు చదవడం, రాయడం, మాట్లాడడం నేర్పించాలని సూచించారు. అదేవిధంగా సాంఘిక శాస్త్రం శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్లానింగ్ గూర్చి కోర్స్ వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమంలో సమయపాలన పాటించాలని సూచించారు. ఉపాధ్యాయుల వృత్తాంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో జరుగుతున్న మౌలిక ,భాషా ,గణిత సామర్థ్యం అభివృద్ధి, ప్రాథమిక పాఠశాలల ఎమ్మార్పీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతిరెడ్డిపల్లి లో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈరోజు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతిరెడ్డిపల్లి లో 126ఎస్ జి టి ఆర్పిలకు ఎస్ ఏ, 62 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకుఐఆర్పిలకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు సంగారెడ్డిలో 201 సోషల్ & ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్లకు, సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాలలో 126 గణితం స్కూల్ అసిస్టెంట్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో 28 మంది డిఆర్పీలు ,A M O బాలయ్య CMO వెంకటేశం కోర్స్ డైరెక్టర్లు విద్యాసాగర్, భాస్కర్, రోజా రాణి పాల్గొన్నారు.

# ప్రజలందరి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

* **దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పేదల ప్రభుత్వం**
* **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**





బయ్యారం మే 13( సమయం న్యూస్) : ఈనెల 18న ఇందిరా గిరి జల సౌర వికాసం పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు.గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు ప్రతి పథకం ప్రజల మంచి కోసం తీసుకొస్తున్న ప్రజా ప్రభుత్వం అని ప్రజలు గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు కోరారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని లక్ష్మీనరసింహపురంలో 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన అనంతరం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. అటవీ హక్కుల చట్టం కింద ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేసుకునేందుకు వీలు కల్పించదని అన్నారు.గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ఈనెల 18న నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట లోని చెంచు కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించబోతున్నాం అని వివరించారు. ఈ పథకం కింద 12,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు గిరిజనులకు ఆదాయం వచ్చేలా ఉద్యానవన శాఖతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ పథకం కింద ప్రతి గిరిజన రైతుకు సోలార్ విద్యుత్ పంపుసెట్టు, స్ప్రింక్లర్లు, అవకాడో, పామ్ ఆయిల్ వంటి మొక్కలు ఉచితంగా అందజేస్తాం అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే మన జీవితాలు మెరుగవుతాయి, దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తెలంగాణ ఎదుగుతుందని పోరాటం చేశామని గుర్తు చేశారు. వనరులు, ఆర్థిక సంపద తెలంగాణ ప్రాంత ప్రజలు వాడుకుంటే వారికి మేలు జరుగుతుందని సోనియాగాంధీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రత్యేక రాష్ట్ర బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేసిందని అన్నారు. ఈ రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుంది అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశాం, 22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నాం, గిరిజన నియోజకవర్గాల్లో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ పథకం దేశ చరిత్రలోనే ఓ రికార్డు అన్నారు. ఇంటికో ఉద్యోగం అని 10 సంవత్సరాల కాలంలో ఒక్కసారి కూడా గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేకపోయారు కానీ మేం అధికారంలోకి రాగానే సర్వీస్ కమిషన్ను ప్రక్షాళన చేసి గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించాం, ఏడాదిన్నర కాలంలో 57, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు యువతను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం అనే స్వయం ఉపాధి పథకాన్ని తీసుకు వచ్చాం. 5 లక్షల మంది నిరుద్యోగులు వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్ల నిధులు ఖర్చు చేయనున్నాం. జూన్ 2న నిరుద్యోగ యువకులకు రాజీవ్ యువ వికాసం శాంక్షన్ లెటర్లు అందజేస్తాం అన్నారు. రైతు భరోసా పథకానికి మరో రెండు వేలు అదనంగా జోడించి అందజేస్తున్నాం అన్నారు. ప్రజా ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని మొదటి ఏడాదిలోనే చేసింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ కోసం 21,500 కోట్లు ఖర్చు చేసాం అన్నారు. 13వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రతినెల 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో సగభాగంగా ఉన్న మహిళలు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, గుడికి, లేదా పిల్లల బడికి వెళ్లేందుకు ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించింది, పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. 200 యూనిట్ల లోపు వాడుకునేవారికి ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నాం అందుకు సంబంధించిన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లిస్తుందని ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో 80 నుంచి 90 శాతం మంది కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది అన్నారు. రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు అందిస్తూ వారి తరపున 12,500 కోట్ల రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుంది అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను మేము రాగానే ఆరు నెలల్లో పూర్తి అయ్యేవి, మూడు సంవత్సరాల్లో పూర్తి అయ్యేవి గుర్తించి నిధులు కేటాయించి వాటిని పూర్తి చేసే పనిలో పడ్డాం అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, వైరా శాసనసభ్యులు రామ్ దాస్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, విద్యుత్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేక, అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి, సూపరిండెంట్ ఇంజనీర్ నరేష్, మూల మధుకర్ రెడ్డి, ఆర్డీవో కృష్ణవేణి, అన్ని విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రెసిడెన్షియల్ ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ మే 13( సమయం న్యూస్) : మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా జిల్లాలోని ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ ప్రధానం చేశారు. వివిధ మేనేజ్మెంట్లలో మహాత్మ జ్యోతిబాపూలే సాంఘిక సంక్షేమ గిరిజన సంక్షేమ మైనారిటీ సంక్షేమ కళాశాలలో ఎంపీసీ బైపిసిలలో జిల్లా స్థాయిలో నిలిచిన 11 మంది విద్యార్థులకు సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డిఐఈఓ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలలో ఎన్డీ ఆర్ ఎఫ్ ఎస్టీ ఆర్ ఎప్ సేవలు

ప్రత్యేక కార్యదర్శి అరవింద కుమార్.

కాళేశ్వరం మే13( సమయం న్యూస్) : సరస్వతి పుష్కరాల్లో ఎన్డీఆర్ ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సేవలు వినియోగించనున్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద కుమార్ తెలిపారు. మంగళవారం కాళేశ్వరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, భక్తులు పుష్కర స్నానాలు చేయు నది త్రివేణి సంగమం, గోదావరి ఘాట్, దేవాలయం, బందోబస్తు ప్రణాళిక తదితర రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల సందర్భంగా భక్తులకు అత్యుత్తమమైన భద్రత మరియు అత్యవసర సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుండి 25వ తేదీ వరకు కాళేశ్వరంలో జాతీయ, రాష్ట్ర విపత్తులు దళ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎన్డిఆర్ ఎఫ్ ఒక టీము 34 మంది, ఎస్డీ ఆర్ ఎఫ్ రెండు టీములు



66 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో 24X7 విధులు నిర్వహిస్తారని తెలిపారు. సరస్వతి పుష్కరాల సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే స్పందించి తక్షణమే సేవలు అందించేందుకు జాతీయ విపత్తుల స్పందనా దళం (NDRF) మరియు రాష్ట్ర విపత్తుల స్పందనా దళం (SDRF) బలగాలను వివిధ ఘాట్ల వద్ద సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. రెండు టీములు ఘాట్స్ వద్ద ఒక టీము దేవాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు భద్రతా నిబంధనలను పాటిస్తూ, అధికారుల సూచనల ప్రకారం పుష్కర స్నానాలు చేయాలని ఆయన సూచించారు. భక్తులు ప్రమాద హెచ్చరికల సూచికలు దాటి నదిలోకి వెళ్లకుండా పటిష్ట పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. పుష్కరాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు అత్యంత ముఖ్యమని ఎప్పటి కపుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రంగా ఉంచాలని, నది, దేవాలయ పరిసరాలు మొత్తం జల్లెడ పట్టి పరిశుభ్రం చేయాలని, వ్యర్థాలు తొలగింపు పర్యవేక్షణ కు ప్రత్యేక అధికారులు ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య. కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి కెవి సతీశ్ కుమార్, తెలంగాణ రీజన్ ఎన్డి ఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ డిప్యూటీ కమాండెండ్ దామోదర్ సింగ్, కాటారం డిఎస్పీ రామిరెడ్డి, దేవస్థానం ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## లాడ్ బజార్ వ్యాపారుల ఉదారత. మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల దగ్గర డబ్బులు తీసుకోని వ్యాపారులు

హైదరాబాద్ మే 13(సమయం న్యూస్) : మిస్ వరల్డ్ పోటీదారులు కొనుగోలు చేసిన వస్తువులను ఉచితంగానే అందజేత, డబ్బులు తీసుకునేందుకు వ్యాపారుల నిరాకరణ హైదరాబాద్ విశిష్టతను చార్మినార్ లాడ్ బజార్ ప్రత్యేకతలను ప్రపంచవ్యాప్తంగా తమ దేశాల్లో చాటాలని మిస్ వరల్డ్ కంటెస్టెంట్లను కోరిన వ్యాపారులు మిస్ వరల్డ్ ప్రతినిధులకు తమ షాపుల్లోకి గులాబీ పూలు ఇచ్చి ఆహ్వానించిన

## రాజీవ్ యువ వికాసం
# దరఖాస్తులు డెస్క్ వెరిఫికేషన్ వేగంగా జరగాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ మే 13(సమయం న్యూస్) : రాజీవ్ యువ వికాసం పథకం కు సంబందించిన లబ్ధిదారుల డెస్క్ వెరిఫికేషన్, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి, గ్రామాలలో తాగునీటి ఎద్దడి పై నివారణ ప్రక్రియ మీద, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ సంక్షేమ అధికారులు, మున్సిపల్ కమిషనర్స్, ఎంపీడీవోలతో కలిసి జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం సంబంధించి బీసీ, ఎస్సి, మైనారిటీ, ట్రైబల్,ఎస్సి కార్పొరేషన్ ఈ డి అధికారులతో డెస్క్ వెరిఫికేషన్ వివరాలని అడిగి తెలుసుకున్నారు. యూనిట్ ల వారీగా ఉన్న లక్ష్యం కి సంబందించి వచ్చిన దరఖాస్తు లలో...ఎంత మందివి డెస్క్ వెరిఫికేషన్ చెక్ చేసారు... ఇంకా ఎంత మందివి చేయాలి.. డెస్క్ వెరిఫికేషన్ పూర్తి అయిన దరఖాస్తు లలో ఎంత మందిని అర్హులుగా గుర్తించ్చారో వెంటనే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరలో అర్హత



గల లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని గ్రౌండింగ్ విషయంలో చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్ట ప్రణాళిక ద్వారా చర్యలు తీసుకోవాలని త్రాగునీటిపై క్షేత్రస్థాయిలో సమస్యలు ఉత్పన్నమైన పక్షంలో నివృత్తికి చేస్తూ గ్రామాలలో ప్రజలకు త్రాగునీరు సమృద్ధిగా అందజేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి...అర్హులకి సంక్షేమ ఫలాలను అందించాలన్నారు.



## 14న విశ్వసుందరీమణుల రామప్ప సందర్శనకు సర్వం సిద్ధం

* **పర్యాటకులు, ప్రజలు సహకరించాలి**

* **ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర**

ములుగు మే 13( సమయం న్యూస్) : 72వ మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచం నలుమూలల నుండి హైదరాబాద్ వచ్చిన సుందరిమణులు ఈనెల 14న సాయంత్రం 4:30 కి ములుగు జిల్లా రామప్ప చారిత్రాత్మక ఆలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర తెలిపారు. ఈ నెల 14న దాదాపు 35 మంది సుందరిమణులు హైదరాబాద్ నుండి బయలుదేరి ములుగులోని హరిత హోటల్కు చేరుకుంటారని అక్కడి నుండి సాంప్రదాయ వస్త్రాల్లో రామప్ప దేవాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చారిత్రాత్మక రామప్ప సంస్కృతిని వివరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వివిధ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెలంగాణ జరూర్ ఆనా.. పేరుతో నిర్వహిస్తున్న ఈ సందర్శనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు చేశామని అన్నారు. ఎటువంటి ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఉంటుందని అన్నారు. అధికారులంతా సమన్వయంతో వారికి కేటాయించిన పనులను పూర్తి చేశారని అన్నారు. సుందరీమణుల పర్యటన నేపథ్యంలో ఈ నెల 14న రామప్ప ఆలయానికి సందర్శకుల అనుమతి లేదని అన్నారు. భక్తులు ప్రజలు సహకరించాలని కోరారు. భద్రత దృశ్య రామప్ప నుండి ఐదు కిలోమీటర్ల వరకు డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం పూర్తిగా నిషేధించామని అన్నారు. కార్యక్రమ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు

# ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ మే 13 (సమయం న్యూస్) : మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుండి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంపై ఎం.ఎస్. ఓ లు, ఎం.పి.డి.ఓ.లు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన వెబెక్స్ సమావేశం లో మాట్లాడుతూ మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లు శాంక్షన్ అయినవి ఎన్ని బేస్మెంట్ లెవెల్ నిర్మాణం పూర్తి చేశారు,ఎన్ని నిర్మాణం లో ఉన్నవి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలను అడిగి తెలుసుకున్నారు. అప్లికేషన్ లెవెల్ లో ఉన్నవి క్షణంగా పరిశీలించాలని, రేషన్ కార్డులు లేనివి, ఒక కుటుంబానికి ఒకటికంటే ఎక్కువ శాంక్షన్ అయిన వాటిని పరిశీలించి తీసివేయాలని, రెండవ విడత అప్లికేషన్లను జిల్లా ఇన్చార్జి మంత్రి అప్రూవ్ చేసిన వాటిని ప్రొసీడింగ్స్ ఇచ్చి శాంక్షన్ చేస్తామని. వర్షాకాలం రాకముందే ఇంటి నిర్మాణం చేపట్టేలా చూడాలని. గ్రౌండింగ్ త్వరగా




పూర్తిచేయాలని అన్నారు. శుక్రవారం వరకు రెడ్ ఫ్లాగ్ ఉన్న అప్లికేషన్లను శుక్రవారంలోపు మళ్ళీ పరిశీలించి అప్రూవల్ కోసం పంపించాలని. ఇందిరమ్మ ఇల్లు కట్టుకొనుటకు డబ్బు సమస్యలు ఉంటే అలాంటి వారికి ఐకెపి లేదా శ్రీనిధి ద్వారా లోన్స్ వచ్చేలా చేయాలని. ఒకవేళ అర్హులైన వారు ఇల్లు కట్టుకునేందుకు నిరాకరిస్తే వారి నుండి లెటర్ ను రాయించి తీసుకుని రద్దు చేయాలని. మెటీరియల్ చార్జెస్, మేస్త్రి కి ఇవ్వవలసిన డబ్బులను కూడా పరిశీలించాలని, ఇసుక పంపిణీ గురించి సంబంధిత తహసీల్దారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం కింద వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి అసలైన లబ్ధిదారులు ఎవరనేది సిగ్రెగేట్ చేసి గుర్తించాలని, అప్లికేషన్ సరిగా ఉంటే సిబిల్ స్కోరు వివరాలను పరిశీలించేందుకు బ్యాంక్ మేనేజర్లకు ఎన్ని అప్లికేషన్లను పంపించారని అడిగి తెలుసుకున్నారు. సిబిల్ స్కోరు కోసం పంపించిన వాటిని బ్యాంకర్లతో ఎప్పటికప్పుడు వివరాలు అడిగి తెలుసుకోవాలని. అసలైన లబ్ధిదారులు ఎంపిక చేసేందుకు ప్రజా ప్రతినిధులకు అప్లికేషన్ల వివరాలను వారితో కలిసి వెరిఫై చేయాలనీ. లబ్ధిదారుల కు లోన్ శాంక్షన్ కొరకు నాన్ ఆపరేటివ్ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించాలని. యాభై వేల యూనిట్ కోసం కొన్ని దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి, గ్రౌండింగ్ చేసి అప్రూవల్ కోసం పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈవో వెంకటరెడ్డి, డి ఆర్ డి ఓ నరసింహులు, హౌసింగ్ పిడి భాస్కర్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి శంకరా చారి, జిల్లా యువజన,క్రీడల అధికారి శ్రీనివాస్, మండల స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు ప్రత్యేక రావాణా సౌకర్యం

* **ఆర్టీసీ భూపాల్ పల్లి డిపో మేనేజర్ ఏ.ఇందు**

భూపాలపల్లి: భక్తులకు శుభవార్త! ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కాళేశ్వరం లో జరుగనున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు భూపాలపల్లి డిపో మేనేజర్ ఎ.ఇందు ఒక ప్రకటనలో తెలిపారు. సరస్వతీ పుష్కరాలు సందర్భంగా భూపాలపల్లి బస్టాండ్ నుంచి కాళేశ్వరం వరకు రోజూ 47 రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా 70 ప్రత్యేక బస్సులు — మొత్తం 130 ట్రిప్స్ నిర్వహించనున్నారు.

**బస్సు టికెట్ ధరలు:** భూపాలపల్లి .. కాళేశ్వరం: ఫుల్ టికెట్ ₹120 / హాఫ్ టికెట్ ₹70

హన్మకొండ .. కాళేశ్వరం: ఫుల్ టికెట్ ₹250 / హాఫ్ టికెట్ ₹140

ప్రయాణికులు ఈ ప్రత్యేక సదవకాశాన్ని వినియోగించుకొని కాళేశ్వరుని దివ్య దర్శనం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. మహాలక్ష్మి పథకం కూడా ఈ సేవలకు వర్తించనుంది.

# బోధన్ నియోజకవర్గంలో టిడిపి పార్టీ కొత్త మండల కమిటీల నియామకం

బోధన్ పట్టణం, మే 13, సమయం న్యూస్ : తెలుగుదేశం పార్టీ (టిడిపి) బోధన్ నియోజకవర్గంలోని బోధన్ మండలం, బోధన్ పట్టణం, సాలూర మండలం, రెంజల్ మండలాలలో కొత్త పార్టీ కమిటీలను ప్రకటించింది. ఈ ప్రకటనను అడహాక్ కమిటీ సభ్యులు కోట గోపాల్ రెడ్డి, పావులూరి వెంకటేశ్వరరావు, సిహెచ్.వి. హనుమంతరావు చేశారు. ఈ నియామకాలు పార్టీ పునర్నిర్మాణానికి భాగంగా, సామాజిక సమానత్వం, యువ నాయకత్వానికి ప్రాధాన్యతతో చేపట్టబడ్డాయి. గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం చేయడం, ప్రజల్లో పార్టీ భావజాలాన్ని విస్తరించడమే లక్ష్యమని చెప్పారు.



- నియమించబడ్డ మండల కమిటీలు
- బోధన్ మండలం
- అధ్యక్షుడు: బద్దూరి కృష్ణారెడ్డి
- ఉపాధ్యక్షుడు: యార్లగడ్డ ఈశ్వరరావు
- ప్రధాన కార్యదర్శి: రాచగళ్ళ హనుమంతరావు
- బోధన్ పట్టణం
- అధ్యక్షుడు: ముప్పాళ్ళ బాలగంగాధర్ రావు
- ఉపాధ్యక్షులు: సురాబత్తుని శ్రీనివాసరావు, దంతం వెంకట్రావు
- ప్రధాన కార్యదర్శి: తన్నీరు సుబ్బారావు
- సాలూర మండలం
- అధ్యక్షుడు: కర్నాటి రామకృష్ణ
- ఉపాధ్యక్షుడు: బొల్లేపల్లి శ్రీనివాస్
- ప్రధాన కార్యదర్శి: చీలా ప్రకాష్
- రెంజల్ మండలం
- అధ్యక్షుడు: కృష్ణారావు విడియాల,
- ప్రధాన కార్యదర్శి: యూసుఫ్ బెగ్

ఈ కార్యక్రమంలో బోధన్ సీనియర్ నాయకుడు అమర్నాథ్ బాబు తిరిగి తెలుగుదేశం పార్టీలో చేరారు. అలాగే, పార్టీకి విశేషంగా సేవలందించినవారికి, యువతకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇవన్నీ సీనియర్ నేతల సమీక్షతో నిర్ణయించబడ్డాయని, అందరూ కలసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నిక కాబడిన కమిటీ సభ్యులచే ప్రమాణస్వీకారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సచిన్ పటేల్, ఉప్పాలపాటి మోహన్రావు, విట్టల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## ఫుడ్ అండ్ సైన్స్ యూనివర్సిటీలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం

బోధన్ డివిజన్, బోధన్ రుద్రూర్ మండలం, మే 13, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లోని రుద్రూర్ & బోధన్ ప్రాంతాలలో, ఫుడ్ అండ్ సైన్స్ యూనివర్సిటీలో బోధన్ డివిజన్ షీ టీమ్ సభ్యులు విజయ్ కుమార్, సునయన ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో షీ టీమ్ యొక్క పాత్ర, కార్యకలాపాలు మరియు మహిళల రక్షణ కోసం అందిస్తున్న సేవల గురించి వివరించబడింది. ప్రధానంగా షీ టీమ్, మహిళా హక్కులు, టీసేఫ్ యాప్, డయల్ 100 సేవలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, జువెనైల్ జస్టిస్ యాక్ట్ (జేజే యాక్ట్) మరియు సైబర్ నేరాల అవగాహన పై విద్యార్థులకు సమాచారం అందించబడింది. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ కళాపన, కాలేజ్ సిబ్బంది, రుద్రూర్ ఎస్ హెచ్ ఓ సిబ్బంది, మరియు 80100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం కలిగించే ఉద్దేశంతో షీ టీమ్ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది.



## జిల్లా పౌరసంబంధాల అధికారిగా యం కృష్ణమూర్తి బాధ్యతల స్వీకరణ

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 సమయం న్యూస్: జిల్లా పౌరసంబంధాల అధికారిగా యం కృష్ణమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ లను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రస్తుతం ఓడిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పని చేస్తుండగా పూర్తి అదనపు బాధ్యతలతో మంచిర్యాల జిల్లాకు వచ్చారు.





## సింగరేణి వ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలి

* **తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి మే 13(సమయం న్యూస్): సింగరేణి వ్యాప్తంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన సింగరేణి జీఎం హెచ్ఆర్డి రఘుపతిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు టెక్నికల్గా నాన్ టెక్నికల్గా ఐటిఐ బీటెక్ తదితర టెక్నికల్ కోర్సులు చదివి వారికి సరియైన నైపుణ్యాల్లో శిక్షణ లేకుండా ఆ రంగాలలో సరియైన శిక్షణ లేకుండా అనేకమంది నిరుద్యోగ యువత అన్యాయం అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి ఏరియాలో మూడు నాలుగు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో వారి చదువుకు తగ్గ భవిష్యత్తు తరాలకు అవసరమయ్యే ప్రస్తుత సమాజంలో టెక్నికల్ గా వాళ్లకు అవసరమయ్యే స్కిల్ ను నిరుపేద నిరుద్యోగ యువతకు నేర్పించాలని పేర్కొన్నారు. సమాజంలో మెరుగైన విద్యను అందించడంతోపాటు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు అభివృద్ధి చేస్తే నాణ్యమైన పని తెలిసిన అభ్యర్థులు అన్ని పారిశ్రామిక రంగాలలో ముఖ్యంగా సింగరేణిలో కూడా నాణ్యమైన ఉద్యోగస్తులు దొరుకుతారని ప్రతి ఏరియాలో ఐదు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు సింగరేణి వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని కోరారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వల్ల ఉపయోగాలు విద్యార్థులకు వారు చదువుకున్న సబ్జెక్టులలో డిగ్రీలలో బీటెక్లలో స్కిల్స్ లేకపోవడం వలన నిరుద్యోగులు ఎంత నష్టపోతున్నారని తెలిపారు. స్కిల్స్ లేకపోవడం వలన ఆ విద్యార్థులకు బయట ప్రైవేట్ కంపెనీలలో గాని ప్రభుత్వ రంగ సంస్థల్లో సింగరేణి సంస్థలలో ఉద్యోగాలు రాకపోవడానికి కారణాలను తెలియజేసినట్లు వివరించారు. సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం గొప్పగా ప్రతి ఏరియాలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కి సిఎస్ ఆర్ ఫండ్ నిధులను విడుదల చేస్తూ నిరుపేద విద్యార్థులందరూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో వారికి చదువుకు తగ్గ స్కిల్స్ నేర్చుకుని భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు అధిరోహించాలని చేస్తున్న కృషి హర్షనీయమని పేర్కొన్నారు.కొత్తగూడెంలో కూడా 5 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కార్పొరేట్ ఏరియాలో మైన్స్ ఏరియాలో ముఖ్యంగా ఐదు సెంటర్లు ఏర్పాటు చేయాలని అదేవిధంగా సివిల్ సర్వీస్ ఐఏఎస్ ఐపీఎస్ కోచింగ్ లు కూడా అందులో శిక్షణ ఇవ్వాలని కోరారు. నిరుపేద డిగ్రీ పాసైన విద్యార్థులందరికీ సివిల్ సర్వీస్ కోచింగ్ కోసం కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ గా ఏర్పాటు చేస్తూ సింగరేణి ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ని కొత్తగూడెంలో ఏర్పాటు చేయాలని ఆల్రెడీ సింగరేణి చైర్మన్ కి తమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగిందని తెలిపారు. కిందిస్థాయిలో అధికారులు దానికి పునాది వేయాలని కోట శివశంకర్ జీఎం విజ్ఞప్తి చేయడం జరిగింది.

## మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలి

* జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 సమయం న్యూస్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలని, ఉపాధ్యాయులతోనే సమాజ మార్పు సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండలం తీగల్ పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉత్తమమైన, ఆదర్శనీయమైన సమాజ స్థాపనలో విద్యార్థులను సిద్ధం చేయవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని



అన్నారు. విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వ సాధన కేవలం ఉపాధ్యాయులతోనే జరుగుతుందని, మంచి ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను తయారు చేయగలుగుతారని, సామర్థ్యాల పెంపుకై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని, తాను నేర్చుకుంటూ విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థులలో గుణాత్మకమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు నూతనమైన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అందిస్తున్న అంశాలను ఆకళింపు చేసుకొని పాఠశాల స్థాయికి తీసుకువెళ్ళి విద్యార్థులలో ఆశించిన మార్పుల సాధన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, కోర్స్ డైరెక్టర్ జి రామన్న, రిసోర్స్ పర్సన్లు మహేష్, రాజేశ్వరి, రమేష్, రాజన్న, వివిధ మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేగంగా ముగియ వస్తున్న ధాన్యం సేకరణ

* **రైతుల హర్షా తిరేకాలు**
* **జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 సమయం న్యూస్: జిల్లాలో రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేయడంతో ధాన్యం కొనుగోలు వేగంగా ముగియ వస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నేటికీ 345 దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, 281 కేంద్రాలతో 92175.120



ధాన్యాన్ని 11433 మంది రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి, 65.13 కోట్ల రూపాయల చెల్లింపులు చేయడం జరిగిందని వివరించారు. నిత్యం 4 వేల నుండి 8 వేల టన్నుల ధాన్యం ఖాంటా వేసి, 358 లారీలతో 6000 8000 టన్నుల ధాన్యాన్ని కరీంనగర్ లోని 56 మిల్లులకు, మంచిర్యాల లోని 16 మిల్లులకు తరలించి, రైతులు దిగుమతి వేగంగా జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన దాన్యం నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజు 5 నుంచి 8 కోట్ల రూపాయలు రైతులకు చెందిన బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆటోమేటిక్ యంత్రంతో శుభ్రం చేసి, కొనుగోలు కేంద్రాలకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. అకాల వర్షం కురిస్తే కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్న టార్పోలిన్ వాడుకోవాలని, ధాన్యం కొలతలు పరీక్షించి, గ్రేడ్ ఏ ధాన్యం, కామన్ ధాన్యం అని నిర్ణయించుకోవాలని, ఆ విధంగా మంచి ఫలితాలు పొందడానికి అవకాశం ఉందన్నారు.



## లాడ్ బజార్ వ్యాపారుల ఉదారత. మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల దగ్గర డబ్బులు తీసుకోని వ్యాపారులు

హైదరాబాద్ మే 13(సమయం న్యూస్) : మిస్ వరల్డ్ పోటీదారులు కొనుగోలు చేసిన వస్తువులను ఉచితంగానే అందజేత, డబ్బులు తీసుకునేందుకు వ్యాపారుల నిరాకరణ హైదరాబాద్ విశిష్టతను చార్మినార్ లాడ్ బజార్ ప్రత్యేకతలను ప్రపంచవ్యాప్తంగా తమ దేశాల్లో చాటాలని మిస్ వరల్డ్ కంటెస్టెంట్లను కోరిన వ్యాపారులు మిస్ వరల్డ్ ప్రతినిధులకు తమ షాపుల్లోకి గులాబీ పూలు ఇచ్చి ఆహ్వానించిన వ్యాపారులు

## బతుకమ్మ కుంట అభివృద్ధిని అడ్డుకుంటున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి

అంబర్ పేట, మే, 13(సమయం న్యూస్) : అంబర్ పేట లోని బతుకమ్మ కుంట కు సంబంధించిన స్థలంపై కోర్టులో లిటిగేషన్ పేరుతో బతుకమ్మ కుంట అభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్ రెడ్డి పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా సీపీఎం పార్టీ అంబర్ పేట్ జోన్ కన్వీనర్ మహేందర్ డిమాండ్ చేశారు. అంబర్ పేట్ మండల పరిధిలో ఉన్న బతుకమ్మ కుంట లో ఐదు ఎకరాల 10 గుంటల ప్రస్తుత భూమిలో అభివృద్ధి పనులు చేయాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న సిపిఎం పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి హనుమంతరావు కృషి వల్ల హైడ్రా ఈ మధ్యకాలంలో అభివృద్ధిని చేపడుతుంది. ఈ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి పై చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు గతంలోనే చెప్పింది కనుమరుగవుతున్న కుంటలు చెరువులని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి అని



కోరింది. కొందరు వ్యక్తులు హైకోర్టులో జహంగీర్ మరి కొందరు వ్యక్తులు కేసు వేయగా రాష్ట్ర హైకోర్టు విచారించి డబల్ బెంచ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి కూడిన ధర్మాసనం బతుకమ్మ కుంటలోని సర్వే నంబర్ 563/1,Ts 71 రాష్ట్ర ప్రభుత్వానిదే అని తీర్పు ఇచ్చింది. సుధాకర్ రెడ్డి హైకోర్టు సివిల్ కోర్టు అనేక పిటిషన్లు కొట్టి వేసింది. ఈ భూమికి సుధాకర్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని చెప్పినది అయినప్పటికీ సుధాకర్ రెడ్డి కోర్టు సమయాన్ని వృధా చేస్తున్నందుకు అతనిపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని . 2003 నుండి 2025 వరకు బతుకమ్మ కుంట చెరువుని మట్టితో పూడ్చినందుకు అతనిపై అనేక కేసులు అంబర్ పేట పోలీస్ స్టేషన్లో అనేక కేసులు ఉన్నాయి. ఆ కేసులు విచారించాలి. బతుకమ్మ కుంట అభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్ఎస్ నాయకుడు సుధాకర్ రెడ్డి వేకరిపై బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం కేటీఆర్ కానీ హరీష్ రావు వెంటనే స్పందించాలి బతుకమ్మ కుంట చెరువులో వేసిన మట్టిని రీసైకిలింగ్ చేస్తున్న హైడ్రాకు అయ్యే ఖర్చును మొత్తం కూడా సుధాకర్ రెడ్డి నుండి వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ లో సిపిఎం పార్టీ జోన్ కమిటీ సభ్యులు జి రాములు బి సుబ్బారావు పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సవం

* **లేచిపోయిన ఇంటి పై కప్ప రేకులు..**

తోగుట మే 13 (సమయం న్యూస్) : మండలం లోని వరదరాజ్ పల్లి లో మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కురిసిన గాలి వానకు గ్రామం లోని ఉప్పరి మల్లేశం ఇంటి పై రేకులు లేచిపోయాయి దానితో ఇంట్లోని సామాను బియ్యం అన్ని తడిసి దాదాపు ఒక లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందనీ సంబంధిత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయం అందించాలని మల్లేశం కుటుంబం , గ్రామస్థులు కోరుతున్నారు.





## పుష్కరాల సందర్భంగమేరుగైన సేవలు అందించాలి

* **సిబ్బంది , మందులు అందుబాటు ఉండాలి.**
* **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్**

కాళేశ్వరం మే 13( సమయం న్యూస్) : డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ రవీంద్ర నాయక్ ఈరోజు130525 కాళేశ్వరం నందు 15వ తేదీ ప్రారంభం అవుతు న్నటువంటి సరస్వతి పుష్కరాలను సంబంధించినటువంటివైద్యఆరోగ్యశాఖ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆరోగ్య శిబిరాలు, ఉద్యోగస్తుల హాజరు, డ్యూటీ రోస్టర్,మందుల ఏర్పాటు మొదలగునవి పరిశీలించారు, అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు కోర్ కమిటీ మెంబర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు పుష్కరాల సమయంలో విధిగా స్టాఫ్ అందరు ప్రజలకు అందుబాటులో ఉండి సరియైన వైద్యం అందించాలని సూచించారు వీరితోపాటు డిఎం & హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ పి ఓ లు డాక్టర్ శ్రీదేవి,,ఉమాదేవి, సందీప్, ఎం ఓ లు మొదలగు వారు.పాల్గొన్నారు.

## జూన్ 5 లోపు ఐ.ఐ.హెచ్.టి. లో ప్రవేశం కొరకు దరఖాస్తు సమర్పించాలి

* **చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్**

పెద్దపల్లి, మే 13 :( సమయం న్యూస్) : జూన్ 5 లోపు ఐ.ఐ.హెచ్. టి. లో ప్రవేశం కొరకు దరఖాస్తు సమర్పించాలని చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిస్సా రాష్ట్రం నందు మంజూరైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ నందు మొదటి సంవత్సరం 202526 తెలంగాణ రాష్ట్రానికి 9 సీట్లు కేటా యించారని, చేనేత టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అన్నారు. 2025..26 విద్యా సంవత్సరానికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐ.ఐ.హెచ్.టి) బరఘ నందు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సు కు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, 17 నుంచి 25 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన యువకులు తమ దరఖాస్తులను సహాయ సంచాలకులు చేనేత జౌళి శాఖ కరీంనగర్ కార్యాలయానికి జూన్ 5 లోపల సమర్పించాలని చేనేత జౌళి శాఖ ఉప సంచాలకులు కే. విద్యా సాగర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## కోనో కార్పస్ మొక్కలు తొలగించాలని బీజేపీ పట్టణ శాఖ డిమాండ్, వినతి పత్రం అందజేత

బోధన్ పట్టణం, మే 13, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ మున్సిపల్ పరిధిలోని డివైడర్లలో పెంచిన కోనో కార్పస్ మొక్కలు ప్రజల ఆరోగ్యానికి హానికరమైనవని వాటిని తొలగించాలని బీజేపీ పట్టణ శాఖ కోరుకుంటూ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ బోధన్ పట్టణ అధ్యక్షులు పసుపులేటి గోపి కిషన్ మాట్లాడుతూ, బోధన్ మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనం, సుందరీకరణ పేరుతో నాటిన ఈ మొక్కలు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయని కావున వెంటనే తొలగించే ప్రయత్నాలు చేయాలని తెలిపారు. ఇందుకుగాను కమిషనర్ సానుకూలంగా స్పందించి ఉన్నతాధి కారుల, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలను చేపడతానని తెలిపారని అన్నారు.

* **కోనో కార్పరస్ చెట్ల దుష్ప్రభావాలు:**

1. ఈ మొక్కల నుండి వెలువడే వాసన గాలి ద్వారా చర్మ, శ్వాస, అస్తమా, అల్లెర్జీ వంటి వ్యాధులు కలుగుతున్నాయి.
2. పక్షులు, జంతువులు ఈ చెట్లపై గూడు పెట్టవు లేదా ఆకులను తినవు.



3. క్రిమి కీటకాలు కూడా ఈ చెట్లకు దరిచేరవు – ఇది ఈ మొక్కల హానికర స్వభావాన్ని తెలుపుతుంది.
4. పర్యావరణానికి, భూగర్భ జలాలకు ఎలాంటి మేలు చేయని ఈ మొక్కలు శాస్త్రవేత్తల ప్రకారం హానికరమైనవి.
5. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వీటిని తొలగించి, ఉపయోగకరమైన వృక్షాలను నాటాలని బీజేపీ డిమాండ్ చేసింది.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్ చారి, మాజీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, రాజులదేవి పవన్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతమ్ గౌడ్, కందికట్ల వాసు, యోగి రాజు, చరణ్, భూమన్న, కిషోర్, బిల్లా విజయ్, లోకేష్, సాగర్, శ్రీకాంత్, అక్షయ్, సంతోష్, ప్రసాద్, విజయ్, నిమ్మ శీను, సోమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డెయిరీ ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి

* **పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**

హనుమకొండ మే 13 (సమయం న్యూస్) : హనుమకొండ : పరకాల నియోజకవర్గంలోనిదామెరలోమహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు మహిళా డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ మహిళా సొసైటీలో పరకాల నియోజకవర్గం లోని మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముల్కనూర్ సొసైటీ ద్వారా పాడి రంగంలో మహిళలు ఏ విధంగా



పురోభివృద్ధి సాధిస్తున్నారనే వివరాలను నిర్వాహకులను ఎమ్మెల్యే, కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను గురించి సొసైటీ నిర్వాహకులు ఎమ్మెల్యే, కలెక్టర్లకు వివరించారు. అనంతరం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మహిళా డెయిరీ గురించి తెలుపుతూ 6 మండలాలలోని మహిళా రైతులతో డెయిరీని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఇందుకు గాను 53 కోఆపరేటివ్ సంఘాలను రిజిస్ట్రేషన్ చేయించినట్లు పేర్కొన్నారు. ఏర్పాటు చేయనున్న డెయిరీని నిర్వహించే విధంగా పాల డెయిరీని గత కొన్నేళ్లుగా స్ఫూర్తిదాయకంగా, విజయవంతంగా నిర్వహిస్తున్న ముల్కనూరు డెయిరీ ద్వారా శిక్షణ ఇస్తునట్లు పేర్కొన్నారు. త్వరలో దామెర మండలం లో డెయిరీ ఏర్పాటు చేస్తునట్టు తెలిపారు. మహిళా రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పాల డెయిరీ ద్వారా కల్తీ లేని స్వచ్ఛమైన పాలు సరఫరా చేయడం, మహిళలని వ్యాపారరంగం లో ముందుకు తీసుకెళ్ళాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. డెయిరీ ఏర్పాటు ద్వారా మహిళల ఉపాధి కల్పనకు సాధ్యమవుతుందని తెలిపారు. 6 మండలాలలో పాడిపశువుల సర్వే, పాల దిగుబడుల సర్వే పూర్తయి నట్టు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ వరంగల్ జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు మేన శ్రీను, కౌసల్య దేవి, ఇతర అధికారులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

# పోలీసుల నిఘా నీడలో ప్రపంచ సుందరీమణుల పర్యటన

* **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

హనుమకొండ మే 13( సమయం న్యూస్) : పోలీసుల భారీ భద్రతల నడుమ ప్రపంచ సుందరీమణుల రేపటి పర్యటన కొనసాగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. తెలంగాణ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వర్ల్డ్ పోటీలకు సంబంధించి హెరిటేజ్ పర్యటనలో భాగంగా రేపు హన్మకొండ, వరంగల్ నగరాల్లో పర్యటిస్తున్న ప్రపంచ సుందరీమణుల భద్రత ఏర్పాట్లపై వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలోవేయిస్తంభాలదేవాలయం, ఖిలా వరంగల్, హరిత కాకతీయ




ప్రాంతాల్లో సుందరీమణుల భద్రత కోసం తీసుకుంటున్న భద్రత చర్యలపై పోలీస్ కమిషనర్ సెక్టార్ వారిగా ఇంచార్జ్ పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు, సుందరీమణులు బస్సులో ప్రయాణించే రోడ్డు మార్గంలో ఎలాంటి సమస్యలు రాకుండా తీసుకుంటున్న భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షా జరిపారు. ముఖ్యంగా సుందరీమణుల పర్యటనను పర్యవేక్షించడం కోసం వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ప్రస్తుతం వున్న సిసి కెమెరాలతో పాటు అదనంగా మరిన్ని సిసి కెమెరాలను ఏర్పాటు చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. ప్రపంచ సుందరీమణుల పర్యటన సందర్భంగా వారి భద్రత కోసం వరంగల్ పోలీస్ కమిషనరేట్ వేయి మందికి పైగా పోలీసులు ఇందుకు వినియోగించడం జరుగుతోందని.ఇందులో ముగ్గురు డిసిపిలు, ఒక అదనపు డిసిపిలు, 11ఏసిపిలు, 32మంది ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు 81ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుళ్ళు 155 కానిస్టేబుళ్ళు 325, మహిళా పోలీస్ సిబ్బంది 106, హోంగార్డ్స్ 210తో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ విభాగాలకు చెందిన పోలీసులను వినియోగించడం జరుగుతోందని. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మన దేశంతో పాటు, తెలంగాణ కీర్తి ప్రతిష్టలు తీసుకవచ్చే రీతిలో అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండంతో ప్రతి పోలీస్ అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

# ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన

* **బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి బీజేపీ వినతి పత్రం అందజేత**

బోధన్ మండలం, మే 13, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో మంగళ వారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరగగా, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు భారతీయ జనతా పార్టీ బోధన్ రూరల్ మండల శాఖ తరపున ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంలో బీజేపీ ప్రతినిధులు ఎమ్మెల్యే కు వినతి పత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన నిరుపేదలందరికీ ఇండ్లు



ఇవ్వాలని కోరారు. ఇండ్లు లేని పేదలు ఇప్పటికే ఎల్3 లిస్ట్‌లో నమోదై ఉన్నారని, వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎల్1 జాబితాలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామంలో పూర్తైన డబుల్ రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బోధన్ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, ప్రధాన కార్యదర్శి జిల్కరి ప్రవీణ్, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాలో టిబి ముక్త్ భారత్ అభియాన్ పకడ్బందీగా నిర్వహించాలి

* **జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా, హరీష్ రాజ్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 13 సమయం న్యూస్: దేశ వ్యాప్తంగా చేపట్టిన టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా, హరీష్ రాజ్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఎం ఎల్ హెచ్ పి., సూపర్వైజర్లు, టిబి నియంత్రణ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ, టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో మే 19 నుండి ప్రారంభించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తొందరగా వ్యాధిని గుర్తించడం, సరైన చికిత్స అందించడం, ప్రజలలో మధుమేహం, హెచ్ఐవి, క్యాన్సర్, గుండె, కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షలు చేయించడం జరుగుతుందని, జిల్లాలోని 100 శాతం




ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఎం ఎల్ హెచ్ పి ల ద్వారా ప్రభావిత వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి గ్రామంలోనే పరీక్షలు నిర్వహించేందుకు గాను 2 వాహనాలు కేటాయించి ఎక్స్రే, పరికరాలు, సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, 60 సంవత్సరాల పైబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 100 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో 10 వ్యాధి లక్షణాలలో జ్వరం, 2 వారాలకు మించి దగ్గు, ఛాతినొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గిన, గవద బిళ్ళలు, వాపులు, తెమడలో రక్తం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే పరీక్షలు చేయడం జరుగుతుందని, వ్యాధి నిర్ధారణ అయినా వారికి నిక్షయ పోషణ్ పథకం క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎక్స్రే పరీక్ష ద్వారా 24 గంటలలో వ్యాధి నిర్ధారణ చేయడం జరుగుతుందని, గ్రామంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రజాప్రతినిధులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ వైద్యులు, ప్రముఖులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువజన సంఘాలు, టిబి వ్యాధి వచ్చిన కోలుకున్న వారు, నిక్షయ మిత్రల సహాయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 2 రోజులలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మాతా శిశు సంరక్షణ, టీకాల కార్యక్రమం, హెచ్ఐవి ఎయిడ్స్, లింగ నిర్ధారణ, ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్య సేవలు, ఆసుపత్రి ప్రసవాలు అంశాలపై ప్రోగ్రామ్ అధికారులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా, సుధాకర్ నాయక్, డా, ఎస్ అనిత, డా, ఎ ప్రసాద్, డా, కృపాబాయి, డా, అనిల్, జిల్లాలోని 150 మంది వైద్యాధికారులు, ఎం ఎల్ హెచ్ పి లు, పర్యవేక్షకులు, జిల్లా టిబి మేనేజర్ సురేందర్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వృధాగా పోతున్న నీరు, పట్టించుకోని సిబ్బంది

జిన్నారం, మే 13,సమయం న్యూస్ : మండల కేంద్రమైన జిన్నారంలో మంచినీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ నుండి నీరు వృధాగా పోతుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నల్లల ద్వారా నీటిని కేవలం 15 నిమిషాలు మాత్రమే వదులుతున్నారని, నీటిని వృధా చేయకుండా మరొక పది నిమిషాలు అధికంగా నీటిని వదిలితే అందరికీ సౌకర్యంగా ఉంటుందని వారన్నారు.ఇలా వృధా చేయడం వల్ల ఎవరికి లాభం లేకుండా పోతుందని వారు వాపోయారు . ఇకనైనా గ్రామంలోని స్పెషల్ ఆఫీసర్ స్పందించి తాగునీటిని ప్రతి ఇంటికి వచ్చేలా చూడాలని, వృధా కాకుండా



చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు హెచ్చరించారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన సందీప్ కుమార్ సుల్తానియా

తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ సందీప్ కుమార్ సుల్తానియా నియమతులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానీయాకు భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. 1998 బ్యాచ్‌కు చెందిన సందీప్ కుమార్ సుల్తానియా బిహార్ రాష్ట్రానికి చెందిన వారు. చార్టర్డ్ అకౌంటెంట్‌గా అకౌంటెన్సీ విభాగంలో ఆయన గ్రాడ్యుయేట్. తొలుత ఆయన తెలంగాణ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేశారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యదర్శిగా కూడా విధులు నిర్వర్తించారు. ఆర్థిక, రవాణా, సహకార సంస్థలు, పర్యాటక రంగాల్లో కీలక పదవుల్లో కొనసాగారు. గ్రామీణాభివృద్ధి, భూ రెవెన్యూ నిర్వహణ, పట్టణాభివృద్ధిలో అపార అనుభవం ఆయన సొంతం. ప్రస్తుతం ప్రభుత్వ ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పని చేస్తున్న ఆయన తాజాగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమతులయ్యారు.



## శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యేను, నూడా చైర్మన్ ను ఆహ్వానించిన కురుమ సంఘ ప్రముఖులు

బోధన్ మండలం, మే 13 సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం అందాపూర్ గ్రామంలో ఈ నెల 19వ తేదీన, సాలూర మండలం మందర్న గ్రామంలో 26వ తేదీన శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ మహోత్సవానికి మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరీ సుదర్శన్ రెడ్డి నీ, జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, నూడా చైర్మన్ కేశ వేణును కురుమ సంఘ ప్రముఖులు ఆహ్వానించడం జరిగింది. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు



తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కురుమ సంఘం అధ్యక్షులు మేడి రవి, పట్టణ అధ్యక్షులు ఈరయ్య, మందర్న మాజీ సర్పంచ్, సాలురా బీజేపీ మండల అధ్యక్షులు రావుబా గంగాధర్, అందాపూర్ గ్రామస్తులు రాజు శెట్టి, గౌండ ఈశ్వర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార కమిషనర్లలో బీసీలు ఎక్కడ?

* **జై స్వరాజ్ పార్టీ అధినేత కే ఎస్వీ గౌడ**

హైదరాబాద్ మే13( సమయం న్యూస్) : ఆర్ టి ఐ నియామకం చేసిన ఉన్న వాళ్ళలో సమర్థులెందరు? సీఎంను ప్రశ్నించిన జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాచార కమిషనర్లలో ఒక్క బీసీకి కూడా అవకాశం ఇవ్వలేదని, రాష్ట్రంలో ఆ అర్హత ఉన్న వారు బీసీల్లో ఒక్కరూ లేరా? అనేది సీఎం ప్రజలకు చెప్పాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ డిమాండ్ చేశారు. సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ తో పాటు మరో నలుగురు కమిషనర్లను నియమిస్తే అందులో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు చోటు లేదని, అలాగే ఎస్టీల నుంచి కూడా ప్రాతినిధ్యం లేదని, ఇదేనా రాహుల్ గాంధీ చెబుతున్న సామాజిక న్యాయం అని ఈ రోజు ఒక ప్రకటనలో కేఎస్ఆర్ గౌడ ప్రశ్నించారు. నియమితులైన వారిలో కూడా కొందరు ఆ స్థాయికి సరిపోతరా అనేది సీఎం ఒక సారి పరిశీలిస్తే తెలుస్తుందని ఆయన అన్నారు. తమది బీసీల పార్టీ అని, బీసీల అభ్యున్నతికి తామే ముందు వరుసలో ఉన్నామని పదే పదే పేర్కొనే సీఎం రేవంత్ రెడ్డి సమాచార కమిషనర్లలో ఒక బీసీ లేకపోవడానికి కారణం ఏమిటో బీసీలకు చెప్పాలని కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు.



## భూ సంబంధిత విన్నపాలను సత్వరమే పరిష్కరించాలి

* **జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి.**

మహబూబ్ నగర్ మే 13( సమయం న్యూస్) : మూసా పేట్ పైలెట్ ప్రాజెక్ట్ భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను భూ భారతి అర్. ఓ .అర్. చట్టం ప్రకారం పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మూసా పేట్ మండలం పైలెట్ మండలంలో ఈ నెల 5 నుండి 13 వరకు నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో బాగంగా మంగళవారం కనకాపూర్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు తెలుసుకుని సూచనలు చేశారు. మండలం అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించినట్లు, దరఖాస్తులను పరిశీలించి నోటీసులు జారీ చేసి క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు 13 గ్రామాల్లో నిర్వహించగా 562 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులకు వివిధ కారణాల వలన హాజరు కాలేని వారు నేడు (మే 14) న తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకో గలరని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులు ఉచితంగా అంద చేయడం జరుగుతుందని అన్నారు. రైతులు,ప్రజలు దరఖాస్తు నింపి కొత్త, పాత పాస్ పుస్తకం,అర్.ఓ.అర్.నకలు ,సంబంధిత డాక్యుమెంట్ లు జత చేసి అంద చేయ వచ్చని తెలిపారు.. సదస్సులో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,తహశీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## ఎడపల్లిలో రోడ్డు ప్రమాదం

* **ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి.**

బోధన్ డివిజన్, ఎడపల్లి మండలం, మే 13, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్, ఎడపల్లి మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం ఎడపల్లి మండల కేంద్రంలోని మంగల్పాహాడ్ చౌరస్తాలో జరిగిన ప్రమాదంలో చాకలి నాగమ్మ మంగల్పాహాడ్ గ్రామానికి చెందిన వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. బోధన్ డిపోకు చెందిన TS 16 Z 0212 నంబర్ గల ఆర్టీసీ బస్సులో నుండి దిగి రోడ్డు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలపై అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వాహనదారులకు ఇబ్బందులే..!

* **అధ్వానంగా ఆర్ అండ్ బీ రోడ్లు**
* **ప్యాచ్ వర్క్‌లతోనే సరిపెడుతున్న అధికారులు**

హైదరాబాద్: వర్షాకాలం దగ్గర పడుతుండగా రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఏటా వర్షాలకు పెద్ద ఎత్తున రహదారులు దెబ్బతింటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల వారీగా అధికారులు నివేదికలు తయారు చేసి వ్యయ అంచనాలు రూపొందిస్తున్నారు. కొత్త రోడ్లను నిర్మిస్తామని, అవసరమైన చోట మరమ్మతులు చేస్తామని.. మంత్రులు, అధికారులు సమీక్షల్లో వెల్లడిస్తున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పలు రోడ్లకు నామమాత్రంగా ప్యాచ్ వర్క్‌లు చేసి వదిలేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1,690.26 కి.మీ మేర రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. దీనికి సుమారు రూ. 203.10 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు నివేదికలు తయారు చేశారు. మరో 1,683.04 కి.మీ మేర రోడ్లకు బీటీ రెన్యువల్ చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.847.98 కోట్ల నిధులు అవసరం. చేపట్టాల్సిన పనులపై నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించామని, అక్కడి నుంచి అనుమతులు రావాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల కొత్త రోడ్లకు టెండర్లు పూర్తయినా, పనులను మాత్రం ప్రారంభించడం లేదు. గుత్తేదారులకు భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉండడంతో కొత్త పనులను చేపట్టడానికి ముందుకు రావడం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని మానవపాడు మండలం అమరవాయి నుంచి కలుకుంట్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. సుమారు 5 కి.మీ మేర బీటీ రెన్యువల్ కోసం రూ.3.33 కోట్లతో అనుమతులు వచ్చాయి. ఇటీవలే టెండర్లు పూర్తయినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. భారీ వర్షాలొచ్చినప్పుడు రాకపోకలు నిలిచిపోయి, వేరే మార్గంలో సుమారు 15 కి.మీ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

## బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి: కృష్ణయ్య



బషీర్‌బాగ్: తెలుగు రాష్ట్రాల్లో పెండింగ్‌లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల సమగ్ర వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్, ఏపీ ఓబీసీ సంఘం అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్‌ల అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల బీసీ సంఘాలు నిర్వహించిన సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ..బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ జరగకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్లుగా గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టుల్లో ఎంతో మంది అధికారులు పదవీ విరమణ చేశారని, పదోన్నతుల జాబితా లెక్కించి భర్తీ చేయాలన్నారు.

## ‘మఖానా’.. పోషకాల ఖజానా!



**తామర గింజలు.. ‘మఖానా’గా పిలుచుకునే ఈ గింజల్లో బోలెడన్ని పోషకాలు నిండి ఉంటాయి. ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభించే ఈ గింజలు ఆరోగ్యానికెంతో మేలని నిపుణులు చెబుతున్నారు. అయితే వీటిని కొందరు పచ్చిగానే తీసుకుంటే.. మరికొందరు వేయించుకొని, ఉడకబెట్టుకొని, కూరల్లో, స్వీట్లలో భాగం చేసుకుంటారు. ఎలా తీసుకున్నా.. తామర గింజలతో ఆరోగ్యానికి చేకూరే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం రండి..**

బరువు తగ్గిస్తాయి! క్యాలరీలు మోతాదుకు మించి తీసుకోవడం వల్ల బరువు పెరుగుతాం. అయితే మఖానాతో ఆ సమస్య లేదంటున్నారు నిపుణులు. ఎందుకంటే దీనిలో క్యాలరీల శాతం తక్కువ! వీటిలో ఉండే ప్రొటీన్, ఫైబర్.. ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. ఫలితంగా ఆహారపు కోరికల్ని అదుపులో పెట్టుకోవచ్చు.. అధిక బరువునూ తగ్గించుకోవచ్చు.



**ఆ సమస్యలు రాకుండా..!**

* తామర గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి వివిధ ఆరోగ్య సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి.
* గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఈ గింజలు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి.
* వీటిలోని క్యాల్షియం, మెగ్నీషియం.. ఎముకలు, దంతాల్ని దృఢంగా మారుస్తాయి. ఐరన్ రక్తహీనత సమస్య రాకుండా కాపాడుతుంది.
* మఖానాలో సోడియం తక్కువ.. పొటాషియం, మెగ్నీషియం.. వంటి ఖనిజాలు ఎక్కువ మోతాదులో ఉంటాయి. వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.
* మఖానాలోని ఫైబర్ మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
* కేవలం ఆరోగ్యాన్నే కాదు.. మఖానాతో చర్మ సౌందర్యాన్ని కూడా మెరుగుపరచుకోవచ్చు. వీటిని క్రమంగా తీసుకోవడం వల్ల ముఖంపై మొటిమలు, ముడతలు రాకుండా ఉంటాయి.

అయితే అలర్జీ, గ్యాస్ట్రిక్ సమస్యలు, కడుపుబ్బరంతో బాధపడే వారు వీటిని దూరం పెట్టడమే మేలట!

# సినిమా



## న్యూ బిగినింగ్స్

అందాల ముద్దుగుమ్మ అనసూయ భరద్వాజ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. న్యూస్ రీడర్‌గా, యాంకర్‌గా, నటిగా తెలుగు ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. అంతే కాకుండా తన అందం, అభినయంతో యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక జబర్దస్త్ ద్వారా మంచి ఫేమ్ తెచ్చుకున్న ఈ చిన్నది సిల్వర్ స్క్రీన్ పైకి ఎంట్రీ ఇచ్చి తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. సోగ్గాడే చిన్నినాయన సినిమాలో చిన్న పాత్రలో మెరిసిన ఈ ముద్దుగుమ్మ రంగస్థలం మూవీలో రంగమ్మత్త పాత్ర ద్వారా తన నటనతో విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు అందుకుంది. ఇక ఈ మూవీ తర్వాత అనసూయకు ఆఫర్స్ క్యూ కట్టాయనే చెప్పాలి. పుష్ప సినిమాలో కూడా దాక్షాయణి పాత్రలో తన విలనిజంతో అందరినీ ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం పలు భాషల్లో సినిమాలో పాటు షోల్లో జడ్జిగా చేస్తూ అభిమానులను ఎంటర్టైన్ చేస్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేసిన ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకుంది. అందులో తన భర్త పిల్లలతో ఈ బ్యూటీ చాలా సంతోషంగా ఉంది. అంతే కాకుండా పిక్స్ షేర్ చేస్తూ 'ఆ సీతారామాంజనేయ కృపతో.. మా తల్లిదండ్రుల ఆశీర్వాదంతో.. మీ అందరి ప్రేమతో.. మా జీవితంలోని మరో అధ్యాయం.. శ్రీరామ సంజీవని.. మా కొత్తింటి పేరు.. జై శ్రీరామ్.. జై హనుమాన్.. న్యూ బిగినింగ్స్' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోస్ తెగ వైరల్ అవుతున్నాయి.

## అలా ఎప్పుడూ అనుకోలే

'బూమ్'తో బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ కత్రినా కైఫ్.. 'మల్లీశ్వరి' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆతర్వాత భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేసిన ఈ అమ్మడు.. కెరీర్ పీక్స్ లో ఉండగానే 2021లో స్టార్ నటుడు విక్కీ కౌశల్‌ను పెళ్లి చేసుకుంది. ప్రస్తుతం మ్యారేజ్ లైఫ్ ని తెగ ఎంజాయ్ చేస్తోంది. కాగా.. ఫిల్మ్ ఇండస్ట్రీలోకి వచ్చి 22 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కత్రినా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. తీవ్రమైన పోటీతత్వ సినిమా ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మారాలి అంటూ ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకుంది. 'టైమ్ ఎప్పుడు ఒకేలా ఉండదు.. అలాగే ఎక్కడ ఆగిపోదు. వెళ్తూనే ఉంటుంది. ఇక కాలంతో పాటు పరిణామాలు కూడా ఎన్నో జరుగుతుంటాయి. వాటన్నిటినీ తట్టుకోగలగాలి. మనం చేయాల్సింది అదే. నన్ను నేను రివైండ్ చేసుకున్నప్పుడు.. ఒక 21 ఏండ్ల అమ్మాయిగా.. పింక్ కలర్ పొట్టి మినీ స్కర్ట్‌లో నటిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ అది గుర్తుకొస్తే చాలా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. అయితే ఇప్పుడు కూడా అలాగే ఉంటుంది అని అనుకోకూడదు. ఎందుకంటే.. చాలా మంది కొత్త నటులు ఉన్నారు. అలాగే కొత్త నటులు అనేవారు ఎల్లప్పుడూ వస్తూనే ఉంటారు.. కాలానుగుణంగా అన్నీ అలా జరుగుతూ ఉంటాయి' అంటూ చెప్పుకొచ్చింది.



## అలియా ఎమోషనల్

ఇండియా, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో బాలీవుడ్‌బ్యూటీ అలియా భట్ ఆసక్తికర పోస్టు పెట్టింది. మదర్స్ డే సందేశాన్ని జాతీయవాద గర్వంతో మిళితం చేస్తూ ఎమోషనల్ అయ్యింది. ఇండియన్‌ఆర్మీకి వారి తల్లులకు అంకితం చేస్తూ సుదీర్ఘ భావోద్వేగ పోస్ట్ చేసింది. 'గత కొన్ని రాత్రులు తలుచుకుంటే తెలియని భయం. ఒక దేశం తన ఊపిరిని బిగబట్టినప్పుడు గాలిలో ఒక నిర్దిష్ట నిశ్శబ్దం ఉంటుంది. గత కొన్ని రోజులుగా మనం అది అనుభవించాం. ప్రతి మాట, వార్త వెనుక, ప్రతి డిన్నర్ టేబుల్ చుట్టూ ఆ నిశ్శబ్దం వినిపిస్తూనే ఉంది. మనలో చాలామంది మన ఇళ్లలో నిద్రపోతుండగా, బోర్డర్‌లో ఉన్న ప్రజలు, సైనికులు చీకటిలో నిలబడి, తమ ప్రాణాలను అడ్డుగా పెట్టి మన నిద్రను కాపాడుతున్నారు. ఇది కేవలం ధైర్యం మాత్రమే కాదు, త్యాగం. ప్రతి యూనిఫాం వెనుక నిద్రపోని ఒక తల్లి కూడా ఉంది. ఆరోజు తన బిడ్డ జోలపాటలు వినే రాత్రి కాదని, అనిశ్చితితో, ఉద్రిక్తతతో కూడిన రాత్రి అని ఆ తల్లికి తెలుసు. ఇటీవలే మదర్స్ డే సందర్భంగా మనమందరం పూలు పంచుకుంటూ, ఆప్యాయంగా పలకరించుకున్నం. దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను కని పెంచిన తల్లుల గురించి నేను ఆలోచించకుండా ఉండలేకపోయాను. ఆ తల్లిదండ్రుల ధైర్యం ఈ దేశాన్ని ఎంతగానో కదిలిస్తోంది. పంటి బిగువున బాధను నొక్కిపెట్టిన వారికి ప్రతిక్షణం అండగా ఉంటాం. మా రక్షకుల కోసం, ఈ దేశం కోసం కలిసి నిలబడతాం. జై హింద్' అంటూ అలియా భట్ రాసుకొచ్చింది.



## కొత్త వారసుడు.. ఎన్టీఆర్ చిత్రానికి శ్రీకారం

నందమూరి కుటుంబం నుంచి నాలుగో తరం వెండితెరపైకి అడుగు పెడుతోంది. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై వైవీఎస్ సతీమణి గీత నిర్మిస్తున్నారు. తెలుగమ్మాయి వీణారావు కథానాయిక. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నారా భువనేశ్వరి క్లాప్ కొట్టగా.. దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి కెమెరా స్విచ్చాన్ చేశారు. నందమూరి సుహాసిని మిగతా కుటుంబ



సభ్యులు చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. నందమూరి మోహనకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. ''సీనియర్ ఎన్టీఆర్ నటుడిగా ఎంత కీర్తి తెచ్చుకున్నారో.. తారక రామారావు కూడా అలాగే ఎదగాలని కోరుకుంటున్నా. రామ్ తన ఉనికిని చాటుకోవడం కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఆ తపన ఉన్నవారంతా కచ్చితంగా పేరుని సొంతం చేసుకుంటారు'' అన్నారు. ''మా నాన్న ఎన్టీఆర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆయన కుమారులు, మనవళ్లు ఎంతో కృషి చేస్తున్నారు. వాళ్లంతా స్టార్లుగా ఎదిగారు. ఇప్పుడు ఇండస్ట్రీలోకి వస్తున్న ఆయన మునిమనవణ్ని కూడా అందరూ ప్రోత్సహించాలని కోరుతున్నా'' అన్నారు లోకేశ్వరి. పురందేశ్వరి మాట్లాడుతూ.. ''మా నాన్న ఎన్టీఆర్ కళాతపస్వి. ఆయన పేరును భారతీయ సినీ రంగంలో సువర్ణాక్షరాలతో లిఖించారు. ఆ తర్వాత బాలకృష్ణ, హరికృష్ణ, కల్యాణ్ రామ్, ఎన్టీఆర్.. ఇలా ప్రతి ఒక్కరూ చిత్రసీమపై చెదరని ముద్ర వేశారు. అలాగే ఇప్పుడీ ఎన్టీఆర్ కూడా పరిశ్రమలోకి వస్తున్నారు. తనకు కూడా కళామతల్లి ఆశీర్వాదంతో పాటు కుటుంబ సభ్యుల ఆశీసులూ ఉంటాయన్నారు.

## రోహిత్, విరాట్‌కు మైదానంలో వీడ్కోలు ఏర్పాటు చేయాల్సింది: అనిల్ కుంబ్లే

టీమ్ ఇండియా ఇంగ్లండ్ పర్యటనకు ముందు మొదట రోహిత్ శర్మ తర్వాత విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్‌మెంట్లను ప్రకటించి క్రీడాలోకాన్ని విస్మయానికి గురిచేశారు. మే 7న హిట్‌మ్యాన్ వీడ్కోలు పలికితే, మే 12 విరాట్.. టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లకు మైదానంలో వీడ్కోలు (ఆన్ ఫీల్డ్ ఫేర్‌వెల్) ఏర్పాటు చేయాల్సిందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. 'ఇద్దరు మేటి క్రికెటర్లు కొద్ది రోజుల వ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్‌మెంట్లు ప్రకటించారు. ఇది నన్ను నిజంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ముఖ్యంగా కోహ్లీ విషయంలో ఇలా జరుగుతుందని నేను అస్సలు ఊహించలేదు. అతడిలో ఇంకా కొన్ని సంవత్సరాలు టెస్ట్ క్రికెట్ ఆడే సామర్థ్యం



ఉంది' అని కుంబ్లే అన్నాడు. అలాగే వీరిద్దరి రిటైర్‌మెంట్ విధానం మీద కూడా అనిల్ కుంబ్లే మాట్లాడాడు. 'ఇది నిజంగా నిశ్శబ్ద నిష్క్రమణ. మైదానంలో ప్రేక్షకుల మధ్య రోహిత్, కోహ్లీల వీడ్కోలు ఉంటే బాగుండేది. గతంలో అశ్విన్ కూడా సిరీస్ మధ్యలోనే తన రిటైర్‌మెంట్ ప్రకటించి వెళ్లిపోయాడు. నా అభిప్రాయం ప్రకారం అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ ముగ్గురి వీడ్కోలు మైదానంలో ప్రేక్షకుల మధ్య జరిగి ఉండాల్సింది' అని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్‌తో, టీమ్‌ఇండియా టెస్ట్ సిరీస్ గురించి కూడా కుంబ్లే విశ్లేషించాడు. 'ఈ సిరీస్‌లో కోహ్లీ కీలక ఇన్నింగ్స్‌లు ఆడతాడని నేను ఊహించా. కానీ అతడు అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. సెలక్టర్లకు కూడా ఇది విషమ పరీక్షే. ఇంగ్లండ్‌లో అయిదు టెస్ట్‌ల సిరీస్ అంటే మామూలు విషయం కాదు. ఇది కఠిన సవాళ్లతో కూడుకున్నది. నాకు తెలిసి రోహిత్, కోహ్లీ నిర్ణయాలతో సెలక్టర్లు కూడా ఆశ్చర్యానికి గురై ఉంటారు' అని అనిల్ కుంబ్లే అన్నాడు.

## మళ్లీ మొదటి నుంచి పంజాబ్, ఢిల్లీ మ్యాచ్

భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా వాయిదా పడిన ఐపీఎల్‌ను మే 17 నుంచి పున:ప్రారంభించాలని బీసీసీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆరు వేదికల్లో (బెంగళూరు, జైపూర్, ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్, ముంబయి) లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ జూన్ 3న జరుగుతుంది. ప్లే ఆఫ్స్ వేదికలను త్వరలో ప్రకటిస్తారు. ఇక, ఈ నెల 8న ధర్మశాల వేదికగా పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. పంజాబ్ ఇన్నింగ్స్‌లో 10.1 ఓవర్ల ఆట తర్వాత మ్యాచ్‌ను అర్ధంతరంగా రద్దు చేశారు. భద్రతా కారణాల రీత్యా ఈ మ్యాచ్‌ను మధ్యలోనే నిలిపివేశారు. సాధారణంగా మ్యాచ్ రద్దయితే ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. కానీ, ఈ రెండు టీమ్‌లకు పాయింట్లను కేటాయించకపోవడంతో అభిమానులు గందరగోళానికి గురయ్యారు. అయితే, కొత్తగా ప్రకటించిన షెడ్యూల్‌తో దీనిపై క్లారిటీ వచ్చింది.



మే 24న జైపూర్ వేదికగా పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ జరగనుంది. ధర్మశాలలో జరిగిన 10.1 ఓవర్ల ఆటతో సంబంధం లేకుండా మళ్లీ మొదటి నుంచి మ్యాచ్‌ను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఒకరకంగా పంజాబ్‌కు ఇబ్బంది కలిగించే విషయమే. ఎందుకంటే ధర్మశాలలో ఆ జట్టు 10.1 ఓవర్లు పూర్తి అయ్యేసరికి ఒకే వికెట్ నష్టపోయి 122 పరుగులు చేసింది. ఇప్పుడు మళ్లీ మొదటి బంతి నుంచి మ్యాచ్ ఆడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. పంజాబ్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి 15 పాయింట్లతో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో గెలిచినా ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరడం ఖాయం.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.